ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.9 ; కనిష్ఠం 28.5
నిర్మల్
జిల్లా వార్తలు
8
ఆదివారం 8 జూన్ 2025



ఖానాపూర్ అటవీశాఖ కార్యాలయం ఎదుట బాధిత కుటుంబాలతో కలిసి ఆందోళన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు



కల్తీ కోరలు!

- జిల్లాలో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న హోటళ్లు
- ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లదీ అదే దారి
- తనిఖీలు లేక ఇష్టారాజ్యం
- ప్రజల ప్రాణాలతో చెలగాటం

నిర్మల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా పలు హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీలలో కల్తీ ఆహారపు విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నాయన్న ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. గత కొద్దిరోజుల క్రితం ఓ పేరేన్నిక గల హోటల్‌లో కల్తీ ఆహార విక్రయాల వ్యవహారం బట్టబయలైన సంగతి తెలిసిందే. అలాగే మరో హోటల్‌లో కూడా కల్తీ మండి బిర్యానీ తిని ఐదుగురు తీవ్ర అస్వ స్థతకు గురయ్యారు. ఇలా వరుసగా సంఘటనలు జరుగుతుండడానికి తనిఖీల లోపమే కారణమంటున్నారు. కాగా జిల్లాకేంద్రంతో పాటు ఖానాపూర్, భైంసాలలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లు కస్టమర్లకు కల్తీ ఆహారాన్ని అంటగడుతున్నాయన్న విమర్శలున్నాయి. ఇందులో భాగం గానే కొద్దిరోజుల క్రితం నిర్మల్‌లోని ఓ హోటల్‌లో దాదాపు 20 మంది చికెన్ బిర్యానీలు తిని తీవ్రఅస్వస్థతకు గురై ఆసుపత్రి పాలైన సంగతి తెలిసిందే. వీరిలో బోథ్‌కు చెందిన ఓ మహిళ పరిస్థితి విషమించి అక్కడి ఆసుపత్రిలో మరణించారు. కుళ్లిపోయిన చికెన్, మటన్‌లతో తయారు చేసిన బిర్యానీలు ఇతర స్నాక్స్‌లను ఇక్కడి పలు హోటళ్లలో కస్టమర్లకు అంటగడుతున్నారంటున్నారు. ప్రాణాంతకమైన కలర్స్, నాణ్యతలేని వంట నూనె, కాలం చెల్లిన మసాలా దినుసులతో పాటు వారం రోజుల వరకు ఫ్రిడ్జ్‌లలో భద్రపరిచిన చికెన్, మటన్‌లను బిర్యానీలుగా, స్టార్టర్స్‌గా తయారు చేసి కస్టమర్లకు అంటగడుతున్నారంటున్నారు. ఆకర్షణీయమైన పేర్లు, ఆఫర్లతో వెలుస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు నాణ్యతను పక్కన పెట్టి ఇష్టానుసారంగా బిర్యానీలను విక్రయిస్తున్నారన్న విమర్శలున్నాయి. అలాగే విచ్చలవిడిగా వెలుస్తున్న తోపుడు బండ్ల పానీ పూరీల అమ్మకాలు ప్రజల ఆరోగ్యాలకు ముప్పుగా మారు తున్నాయి.



నిర్మల్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు (ఫైల్)



ఒక రెస్టారెంట్‌లో కుళ్లిన చికెన్, కూరగాయలు (ఫైల్)

తనిఖీలు కరువు

కాగా హోటళ్లు, రెస్టారెంట్లు, స్వీట్‌హోమ్‌లో సంబంధిత అధికారుల తనిఖీలు కరువవుతుండడంతో యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా కల్తీ బిర్యానీలు, స్వీట్లను కస్టమర్లకు అంటగడుతున్నాయన్న ఆరోపణలున్నాయి. ముఖ్యంగా జిల్లాకు రెగ్యులర్ ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ లేకపోవడం కూడా ఇక్కడి హోటల్ యజమానులకు వరంగా మారుతోంది. ప్రస్తుతం ఆసిఫాబాద్ జిల్లా ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ జిల్లాకు కూడా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. రెండు జిల్లాలకు ఆఫీసర్‌గా ఉన్నందున నిర్మల్ జిల్లాలో ఆ ఆఫీసర్ రెగ్యులర్‌గా తనిఖీలు చేపట్టలేకపోతున్నారంటున్నారు. దూర భారం కూడా తనిఖీలకు ఆటంకం అవుతుందంటున్నారు. దీనిని అలుసుగా తీసుకుంటున్న హోటల్, రెస్టారెంట్, స్వీట్ హోమ్‌ల యజమానులు కస్టమర్లకు కల్తీ ఆహారాన్ని అంటగడుతున్నారన్న ఫిర్యాదులున్నాయి. కొద్ది రోజుల క్రితం ఇక్కడి డీ మార్ట్‌లో విక్రయిస్తున్న కాలం చెల్లిన వస్తువులను ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ పట్టుకున్న సంగతి తెలిసిందే. అడపాదడపా తనిఖీలు జరుగుతుండడంతో హోటల్ యజమానులంతా అప్రమత్తమై తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారని ఆ తర్వాత మళ్లీ యధావిధిగా కల్తీ వంటకాలతో కస్టమర్ల ప్రాణాలకు ముప్పు తెస్తున్నారంటున్నారు. ఇప్పటికైనా నిర్మల్ జిల్లాకు రెగ్యులర్ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌ను నియమించాలని కోరుతున్నారు.



నిర్మల్‌లో అధికారులు సీజ్‌చేసిన హోటల్ ఇదే (ఫైల్)

కాసుల కోసం కక్కుర్తి

నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు భైంసా, ఖానాపూర్ ప్రాంతాల్లోని పలు హోటళ్లు, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో కల్తీ ఆహారాన్ని నిర్భయంగా సప్లై చేస్తున్నారు. వీటి యజమానులు కేవలం కాసుల కోసం కక్కుర్తి పడుతూ నాణ్యత లేని బిర్యానీలు ఇతర చికెన్, మటన్, ఫిష్‌లతో కూడిన కర్రీలను వినియోగదారులకు అంటగడుతూ పెద్దమొత్తంలో డబ్బులు గుంజుతున్నారు. అయితే ప్రస్తుతం యువత హోటల్ తిండికి బానిసలుగా మారడం వీటి యజమానులకు వరంగా మారుతుంది. ఆకర్షణీయమైన ఆఫర్లు సైతం ఇస్తూ ఈ హోటళ్లు వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. గత కొంతకాలం నుంచి జిల్లా కేంద్రానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు ఖానాపూర్, భైంసా వాసులు సైతం పెద్దసంఖ్యలో వివిధ రకాల పనుల కోసం వస్తున్నారు. వీరంతా మధ్యాహ్నం, రాత్రివేళల్లో హోటళ్లలోనే భోజనం చేయడం రివాజుగా మారింది. దీనిని ఆసరాగా చేసుకుంటున్న పలువురు యజమానులు కల్తీ ఆహారాన్ని అంటగడుతూ వారి నుండి డబ్బులు గుంజుతున్నారు. హోటల్ యజమానుల దురాశ అమాయక వినియోగదారులకు ప్రాణసంకటంగా మారుతోంది.

పోడు భూములలో

అటవీశాఖ విధ్వంసం వెంటనే నిలిపివేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం నూతన్‌కుమార్
- ఖానాపూర్‌లో అటవీశాఖ కార్యాలయం ఎదుట గిరిజనుల ఆందోళన
- గిరిజనేతరులకు సైతం పోడు పట్టాలను ప్రభుత్వం మంజూరు చేయాలని డిమాండ్

ఖానాపూర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఏళ్ల తరబడిగా సాగు చేసుకుంటున్న పోడు భూములలో జేసీబీల సహాయంతో గుంతలు తవ్వుతూ అటవీ శాఖ అధికారులు చేస్తున్న విధ్వంసాన్ని వెంటనే నిలిపివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఖానాపూర్‌లోని అటవీశాఖ కార్యాలయం ఎదుట బాధిత రైతు కుటుంబాలతో కలిసి సీపీఎం ఆధ్వర్యంలో బైఠాయించి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన్‌కుమార్ మాట్లాడుతూ.. తర్లపాడ్ గ్రామంలోని బోసు భూమన్న, బోసు నర్సయ్య అనే ఇద్దరు అన్నదమ్ములు ఏళ్ల తరబడిగా పోడు భూములను సాగు చేసుకుంటున్నారన్నారు. వారి కుటుంబాలకు ప్రధాన జీవనాధారంగా ఉన్న పోడు భూములలో ఇదివరకే ప్రభుత్వం రెండుసార్లు సర్వే నిర్వహించిందన్నారు. అయినప్పటికీ అధికారులు ఇటీవల వారిద్దరి అన్నదమ్ములకు సంబంధించిన ఐదు ఎకరాల పోడు భూమిలో జేసీబీల సహాయంతో గుంతలు తవ్వుతూ విధ్వంసానికి పాల్పడ్డారన్నారు. అంతేకాకుండా భూమి చుట్టూ కందకాలను తవ్వించి కంచెను ఏర్పాటు చేసేందుకు అటవీ శాఖ అధికారులు ప్రయత్నించడం సమంజసం కాదన్నారు. ఖానాపూర్ మండలంలోని తర్లపాడ్‌తో పాటు కడెం మండలంలోని అల్లంపెల్లి సమా పెంబి మండలంలో సైతం పోడు భూములలో అటవీ అధికారులు మొక్కలు నాటే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ ప్రయత్నాలను క్షేత్రస్థాయిలో ప్రజలు అడ్డుకుంటున్నారని తెలిపారు. వానాకాలం సీజన్ ప్రారంభమైనందున భూములు దున్నుకునేందుకు రైతులు సిద్ధమవుతున్న నేపథ్యంలో అటవీ భూములలో ట్రాక్టర్లు పెట్టకుండా అటవీ శాఖ హెచ్చరికలు జారీ చేయడం సరికాదన్నారు. ఇకనైనా అటవీ శాఖ అధికారులు ఇటువంటి కవ్వింపు చర్యలకు పాల్పడడం మానుకోవాలన్నారు. గిరిజనేతరులకు సైతం పోడు పట్టాలను ప్రభుత్వం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, బాధిత రైతు బోసు భూమన్న, బోసు నర్సయ్య, తదితరులున్నారు.

డీసీసీ అధ్యక్షుడిని

కలిసిన కాల్వ ఆలయ పాలకవర్గం



డీసీసీ అధ్యక్షుడితో కాల్వ ఆలయ పాలకవర్గం

నిర్మల్ రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : దిలావర్‌పూర్ మండలం కాల్వ గ్రామంలో గల శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ పాలకవర్గం శనివారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావును జిల్లా కేంద్రంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేశారు. చైర్మన్ మహేందర్, ధర్మకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి శనివారం భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో వస్తారని, వారికి ఇబ్బందులు కలుగకుండా చూడాలని నూతన పాలకవర్గానికి సూచించారు.

శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామిని

దర్శించుకున్న డీసీసీ అధ్యక్షుడు

డీసీసీ అధ్యక్షులైన కూచాడి శ్రీహరిరావు శనివారం పట్టణంలోని దేవరకోట దేవస్థానంలోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామిని శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవరకోట దేవస్థానం చైర్మన్ కొండ శ్రీనివాస్, ధర్మకర్తలు, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.



పీఎం శ్రీలో భాగంగా పాఠశాలకు మంజూరైన సంగీత పరికరాలను ప్రదర్శిస్తున్న మస్కాపూర్ పాఠశాల ఉపాధ్యాయులు

పీఎం శ్రీ పథకంలో మస్కాపూర్

ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సంగీత పరికరాలు

ఖానాపూర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైసింగ్ ఇండియా పథకంలో మండలంలోని మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు శనివారం సంగీత పరికరాలు వచ్చాయి. రానున్న విద్యా సంవత్సరం నుండి పాఠశాలలో సంగీతంలో కూడా విద్యార్థులకు నైపుణ్యం కలిగేలా బోధన కొనసాగుతుందని ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్ రావు వెల్లడించారు. కాగా పీఎం శ్రీ పథకంలో భాగంగా పాఠశాలకు అందిన సంగీత పరికరాలు మృదంగం, తబలా, డోలు, వయోలిన్‌లను టీచర్లు వెన్నం అంజయ్య, పడాల దీప్తి, శోభారాణి, చందన, రాపర్తి కిషన్ ప్రసాద్, చాట్ల విజయ్‌కుమార్ ప్రదర్శించారు.

నల్దుర్తి తుర్కం చెరువు

ఎకో టూరిజం పర్యాటకులకు అనువైన ప్రదేశం



నల్దుర్తి తుర్కం చెరువులో సఫారీ వాహనాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర అటవీశాఖ అధికారి సువర్ణ

- ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి సువర్ణ



నల్దుర్తి తుర్కం చెరువులో పర్యాటకుల కోసం సఫారీ వాహనం ఇదే

మామడ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : నల్దుర్తి తుర్కం చెరువు ప్రాంతం ఎకో టూరిజం పర్యాటకులకు అనువైన ప్రదేశమని రాష్ట్ర అటవీశాఖ పీసీసీఎఫ్ హెడ్ ఆఫ్ ది ఫోర్స్ హైదరాబాద్ అధికారి సువర్ణ అన్నారు. తుర్కం చెరువు ఎకో టూరిజంకు సంబంధించిన సఫారీ వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యాటక కేంద్రాలను గుర్తించి ప్రజల కోసం వాహనాలను సమకూరుస్తున్నట్టు తెలిపారు. ఇంతేగాక ప్రతి ఒక్కరూ ప్రకృతిని కాపాడాలని వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యతగా అలవర్చుకోవాలన్నారు. ఎకో టూరిజం పరిసరాలలో పరిశుభ్రత పాటించాలని, చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడెయ్యవద్దన్నారు. ఈ కార్యక్రమంలో బాసర సీసీఎఫ్ శర్వానంద్, డీఎఫ్‌వో నాగిని భాను, ఎఫ్ఎస్‌వో శ్రీనివాస్, అన్నపూర్ణలు పాల్గొన్నారు.

జిల్లాలో శిథిలావస్థలో ఉన్న

ప్రభుత్వ పాఠశాల భవనాల కూల్చివేతకు చర్యలు

- కలెక్టర్ అభిలాష అభినవ్





శిథిల భవనాలను కూల్చి వేస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల భవనాల కూల్చివేతకు చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం పత్రిక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం కుబీర్ మండలంలోని అంతర్ని గ్రామంలో ప్రభుత్వ పాఠశాల భవనం కూలిన ఘటన దురదృష్టకరమని పేర్కొన్నారు. కూల్చివేతకు అనుమతులు తీసుకున్నప్పటికీ, ఇటీవలి వర్షాల కారణంగా ఆలస్యమైందని వెల్లడించారు. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారని, వారిని వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామని, ప్రమాదం లేకుండా క్షేమంగా ఉన్నారని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లలోని పలు పాఠశాలల శిథిలాల భవనాల కూల్చివేతకు రోడ్లు, భవనాల శాఖ నుంచి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు తీసుకొని తక్షణమే కూల్చివేత ప్రక్రియ చేపట్టనున్నామని తెలిపారు. విద్యార్థులు భద్రతాయుత వాతావరణంలో చదివేలా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు.

మంజులాపూర్‌లో తప్పిపోయిన ఐదేళ్ల చిన్నారి

- స్పందించి తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

నిర్మల్ రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంజులాపూర్ గ్రామంలో ఐదు సంవత్సరాల తనుశ్రీ అనే చిన్నారి తప్పిపోయి రోడ్డుపై ఉండగా వెంటనే ఆ చిన్నారి తల్లిదండ్రులను పిలిపించి అప్పగించినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. ఇట్టి విషయంలో మానవతా దృక్పథంతో త్వరితగతిన స్పందించిన రూరల్ ఎస్సై లింబాద్రి, ఏఎస్సై బాబారావు, మహిళా కానిస్టేబుల్స్ లక్ష్మీ, పరిమళను జిల్లా ఎస్పీ జానకీషర్మిల ప్రశంసించారు.



చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

ప్రమాదవశాత్తు

వ్యవసాయ బావిలో పడి రైతు మృతి



మణిచందర్ (ఫైల్)

సోన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కూచన్‌పెల్లి గ్రామంలో వ్యవసాయ బావిలో పడి ఇందూర్ మణిచందర్(21) అనే వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే ఇందూర్ మణి చందర్ తన తోటలోకి పసుపుకు నీళ్లు పారించడానికి వెళ్లి, తర్వాత అన్నం తిన డానికి ఇంటికి వచ్చి మరలా తోటలోకి వెళ్లాడు. సాయంత్రమైన ఇంటికి రాలేక పోవడంతో మృతుడి తండి తన కొడుకు గురించి తోటకు వెళ్లి చుట్టు పక్కల వెతికి బావి వద్దకు వచ్చాడు. అనుమానంతో బావి నీటిలో వెతకగా మణిచందర్ మృతి చెంది ఉన్నాడు. మృతు డు ప్రమాదవశాత్తు బావిలో పడి ఉంటాడని, మృతుడి తండ్రి మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ ప్రతాప్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రధాని మోదీ సంస్కరణలతో

ప్రపంచంలో అగ్రగామిగా భారత్

- ముథోల్ ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్



కో కన్వీనర్ బండారి దిలీప్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్

భైంసా, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) ; ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా ప్రధాని మోదీ చేపడుతున్న సంస్కరణల మూలంగా భారతదేశం అన్ని రంగాల్లోనూ ప్రపంచంలోనే అగ్రగామిగా ఎదుగుతోందని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ అన్నారు. శనివారం స్థానిక ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో భైంసా పట్టణ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో ప్రధానిమోదీ 11 ఏళ్ల పాలనపై ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దేశహితమే శ్వాస, ధ్యాసగా ప్రధాని మోదీ పాటుపడుతున్నారని వెల్లడించారు. ప్రధాని మోదీ తీసుకుంటున్న చారిత్రత్మాక నిర్ణయాలతో ప్రపంచం నివ్వెరపోయేలా భారత్ ప్రగతిబాటలో దూసుకపోతోందన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతియే ధ్యేయంగా ప్రధాని మోదీ సర్కార్ ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు సత్ఫలితాలనిస్తుయన్నారు. ఆపరేషన్ సింధూర్‌తో శత్రు దేశాన్ని గజగజలాడించామన్నారు. ఒకే చట్టం నినాదంతో 370 ఆర్టికల్ రద్దు చేయడం జరిగిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో సాధించిన విజయాలు, చేపట్టిన సంస్కరణలు, ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. పార్టీ శ్రేణులన్నీ క్షేత్రస్థాయిలో విస్తృత పర్యటనలు చేపట్టి ప్రధాని మోదీ పనితీరును ఇంటింటా వివరించాలని సూచించారు. కార్యకర్తలంతా కార్యోన్ముఖులై రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయభేరి కోసం సన్నద్ధమవ్వాలని పేర్కొన్నారు. . అనంతరం ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలన ప్రోగ్రామ్ కన్వీనర్‌గా ఎన్నికైన ముల్లావార్ అనిల్, కోకన్వీనర్ బండారి దిలీప్‌లను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ ముథోల్ నియోజకవర్గ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, పట్టణ అధ్యక్షులు రావుల రాము, జిల్లా కార్యవర్గ సభ్యులు యనుపోతుల మల్లేష్, నాయకులు గాలి రవి, తూమోల్ల దత్తాత్రి తదితరులున్నారు.



ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

సర్కారు బడిలోనే విద్యార్థులకు నాణ్యమైన చదువులు

● 'బడిబాట'లో ఉపాధ్యాయులు

తలమడుగు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): సర్కారు బడిలోనే విద్యార్థులకు నాణ్యమైన చదువులు లభిస్తాయని సుంకిడి పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. శనివారం మండలం సుంకిడి గ్రామంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శనివారం ఉదయం గ్రామంలో ఇంటింటికీ తిరిగి పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని, తద్వారా నాణ్యమైన ఉచిత విద్యను పొందాలని తల్లిదండ్రులను, విద్యార్థులను కలిసి ప్రభుత్వ బడుల్లో లభించే సౌకర్యాల గురించి వివరిస్తూ ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని రెండవ రోజు కొనసాగించారు. జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ స్వామి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయ బృందంతో విద్యాబోధన జరుగుతుందని, అలాగే పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, రాగి జావా, మధ్యాహ్నం భోజనం ఉచితంగా లభిస్తాయని, అలాగే విశాలమైన క్రీడా మైదానం ఉందని, ఆటలు నేర్పించడానికి అనుభవజ్ఞులైన పీడీలచే జిల్లా, రాష్ట్రస్థాయిలో ఆటల పోటీల్లో విద్యార్థుల ఎంపిక జరుగుతుందన్నారు. ఎన్సీసీ యూనిట్ కూడా ఉందని, ఇందులో చేరడం వల్ల భవిష్యత్తులో ఆర్మీలో చేరవచ్చని, అలాగే విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఉంటుందని వివరిస్తూ బడిబాట కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు బి.గజానన్, సుకుమార్ పేట్కులే, పీడీ నాందేవ్, తదితరులు పాల్గొన్నారు.

లంబాడా కులస్థులమని చెప్పుకుంటే ఊరుకోం : బంజారా సేవా సంఘం

ఇచ్చోడ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): దేవానంద్ కుటుంబం ఎస్టీలు కాదని జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తర్వులు జారీ అయినప్పటికీ మేం ఎస్టీలను నిరూపించుకుంటామని ప్రకటనలు చేయడం సిగ్గుచేటని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం సభ్యులు పేర్కొన్నారు. శనివారం ఇచ్చోడలో సంఘ సభ్యులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడా రు. తప్పుడు ఎస్టీ సర్టిఫికెట్స్‌తో ఇచ్చోడలో పదవులు చేపట్టిన చౌహన్ దేవానంద్ కుటుంబం లంబాడా జాతికి చెందిన వారిమని చెప్పుకుంటే ఊరుకునేదిలేదన్నారు. ఇందులో సంఘ సభ్యులు ఆడె మానాజీ, రాథోడ్ శివలాల్, రాములు, బలిరాం, వసంత్ రావు, సాయిరాం, తదితరులున్నారు.



ఇచ్చోడలో మాట్లాడుతున్న సంఘ సభ్యులు

అంతటా బక్రీద్ పర్వదినం

● ఆదిలాబాద్ జిల్లాలో ఈద్గాల వద్ద ముస్లిం ప్రత్యేక ప్రార్థనలు ● పండుగ శుభాకాంక్షలు తెలిపిన బోథ్ ఎమ్మెల్యే, పలువురు నేతలు



బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



ఇంద్రవెల్లిలో ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పిప్పల్‌కోటిలో నమాజు చేస్తున్న దృశ్యం



ప్రవచనాలు ఇస్తున్న హఫీజ్ అహ్మద్ రంజని

నేరడిగొండ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా అంతటా శనివారం బక్రీద్ పండుగను జరుపుకున్నారు. నేరడిగొండ మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే నివాసంలో మండల మాజీ జడ్పీటీసీ డాక్టర్ జహీర్, వివిధ మైనారిటీ సోదరులను కలిసి అలైబలై చేసి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు ఉన్నారు.

అలాగే భక్తికి, త్యాగానికి, సహనానికి బక్రీద్ పండుగ ప్రతీక అని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. భక్తి, శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపు కోవాలన్నారు. పేదల పట్ల జాలి, దయ కలిగి ఉండటమే బక్రీద్ ఇచ్చే సందేశమన్నారు. అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఆయనతో పాటు బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఆడే వసంత్ రావు, జిల్లా సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

భీంపూర్: మండలంలోని పిప్పల్‌కోటి, నిపాని, గోన, వాడుర్, ఆర్లీ(టి), అంతర్గంతో పాటు ఆయా గ్రామాలలో శనివారం బక్రీద్ (ఈదుల్ హజ) పండగ వేడుకలను ముస్లిం సహోదరులు ఘనంగా నిర్వహించారు. స్థానిక మసీదు, ఈద్గాలా వద్ద నమాజ్ చేశారు. అనంతరం హఫీజ్‌లు, అలీంలు, ఇమాంలు ప్రవచనాలు బోధించారు. దేశం ఉన్న ప్రతి ఒక్కరు ఆయురారోగ్యాలతో ఉండాలని సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు సంవృద్ధి చెందాలని ప్రార్థన చేశారు.

ఇంద్రవెల్లి: భక్తి విశ్వాసాలు, త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండుగను శనివారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని ఈద్గాల్లో ఉదయం 8 గంటలకు సామూహిక ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంతేకాకుండా మత పెద్దలు ఆయా చోట్ల ప్రార్థనలు చేయించి సందేశమిచ్చారు. ముస్లిం సోదరులు హాజరై ఒకరికొకరు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నమాజ్ వేడుకల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక ఎస్సై సాయన్న ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు అబ్దుల్ రహిమ్, ఎండీ మసుద్, మీర్జా జీలానీ బేగ్, ఎండీ జహీర్, మహమ్మద్ అంజద్, షేక్ సూఫీయాన్, ఎండీ జావిద్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ అర్బన్: ప్రతీ ఒక్కరు బక్రీద్ పండుగను కుటుంబ సమేతంగా సంతోషంగా జరుపుకోవాలని మాజీ మంత్రి జోగు రామన్న కోరారు. శనివారం బక్రీద్ పండుగ సందర్భంగా పట్టణానికి చెందిన పార్టీ కార్యకర్త ఆలం సేమియాలను పార్టీ కార్యాలయానికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న కార్యకర్తలతో కలిసి బక్రీద్ సేమియాలను సేవించారు. అనంతరం మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ ప్రతి యేటా రంజాన్, బక్రీద్ పండుగలను భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతున్నాయని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇందులో కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పర్వదిన వేడుకలను సిరికొండ మండల కేంద్రంలో ముస్లిం సోదరులు శనివారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. దీనిలో భాగంగా పండుగను పురస్కరించుకుని స్థానిక మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు సమాద్, జైనూల్, అబ్దుల్ మోబీన్, షబ్బీర్, బాబు, ఖాసిం, తదితరులు పాల్గొన్నారు.



నేల బీటలు వారడంతో వాడుముఖం పడుతున్న పత్తి మొలకలు

తొలకరి జాడేది?

(5వ పేజీ తరువాయి...)

పరిస్థితి ఏర్పడుతుంది. ముఖ్యంగా తలమడుగు, తాంసి, జైనథ్, బేల మండలాల్లో కొంత మంది రైతులు పత్తి విత్తనాలను విత్తారు. జిల్లా వ్యాప్తంగా 25 శాతం పంటల సాగు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా మిగితా పంటల సాగును వర్షాలు కురిసిన తర్వాతనే చేపట్టే అవకాశం కనిపిస్తుంది. కొంత మంది రైతులైతే మే మాసంలోనే పొడినేలల్లోనే విత్తనాలు వేసి వదిలేస్తారు. వర్షాలు కురవగానే పత్తి విత్తనాలు మొలకెత్తుతాయని రైతులు చెబుతున్నారు. ఇలా విత్తిన విత్తనం ఏపుగా పెరుగుతుందని రైతులు భావిస్తున్నారు. అలాగే చీడపీడలను తట్టుకుని అధిక దిగుబడులు వస్తాయని చెబుతున్నారు. ఇప్పటికే పంటలను సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్న రైతులు వర్షాల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

ఇచ్చోడ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కోకస్‌మన్నూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోకస్‌మన్నూర్ గ్రామానికి చెందిన గంగయ్య(52) గ్రామానికి కొద్ది దూరంలో ఒంటరిగా నివసిస్తున్నాడు. శనివారం ఉదయం అపస్మారక స్థితిలో పడిపోయి ఉన్న అతన్ని చూసి గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చెరుకున్న పోలీసులు మృతుడి తలకు గాయాలు ఉన్నట్లు గుర్తించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై పురుషోత్తం పేర్కొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

● తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

ఉట్నూర్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒక గ్రామంలో జరుగనున్న బాల్య అభిమాని బృందం అడ్డుకుంది. ఆ గ్రామానికి చెందిన బాధితురాలు నేరుగా షీ టీంను సంప్రదించగా షీ టీం ఇన్‌చార్జీ బి.సుశీల ఉట్నూర్ సీఐ గండికోట మొగిలి సహకారంతో చైల్డ్ వెల్ఫేర్,డీసీపీయూ, చైల్డ్‌లైన్, ఘార్ ఎన్జీవో, షీ టీం కానిస్టేబుల్, పోలీసులు కలిసి బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం ఇన్‌చార్జి సుశీల మాట్లాడుతూ బాల్య వివాహ నిషేద చట్టం 2006 ప్రకారం బాల్య వివాహాలు చేయడం తప్పన్నారు. అంతేకాకుండా బాల్య వివాహం నిషేద చట్టం ద్వారా రూ.రెండు లక్షల జరిమానా, సంవత్సర పాటు జైలు శిక్ష విధించడం జరుగుతుందని వివరించారు. అమ్మాయికి 18 సంవత్సరాలు నిండిన తర్వాత, అబ్బాయికి 21 సంవత్సరం నిండిన తర్వాతనే వివాహాలు నిర్వహించాలన్నారు. అమ్మాయికి 16 సంవత్సరాలు, మహారాష్ట్ర చంద్రపూర్ జిల్లాకు చెందిన మేజర్ అబ్బాయితో ఈ నెల శనివారం పెళ్లి నిశ్చయించారు. ఇలా పెళ్లి చేయడంతో అమ్మాయి ఉజ్వల భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. అమ్మాయి తల్లిదండ్రుల నుంచి బాల్య వివాహం చేయమని ఒప్పంద పత్రాన్ని రాసి తీసుకున్నామన్నారు. వారి వెంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చిత్రకళ, చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సిలర్ పద్మ, షీ టీం కానిస్టేబుల్ రోహిణి, ఘార్ ఎన్జీవో కో ఆర్డినేటర్ కె.వినోద్, ఏఎస్సై ఉన్నారు.

కాంగ్రెస్ నేతల మాటలను తిప్పికొట్టాలి

● మాజీ మంత్రి జోగురామన్న



ప్రత్యక్ష డిబేట్ కార్యక్రమాన్ని తిలకిస్తున్న మాజీ మంత్రి జోగురామన్న


ఆదిలాబాద్ అర్బన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కళ్లకు కట్టినట్లు ప్రాజెక్టుల నిర్మాణాలు చేపటడం జరిగిందని మాజీ మంత్రి జోగురామన్న అన్నారు. తప్పుడు ప్రచారాలు చేస్తూ బిల్లులు లేపుకునే కాంగ్రెస్ నేతల మాటలను తిప్పికొట్టాలని సూచించారు. శనివారం కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొడుతూ మాజీ మంత్రి హరీష్‌రావు ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లైవ్ టెలికాస్ట్ యాప్ ద్వారా టీవీలో ప్రత్యక్ష డిబేట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా మాజీ మంత్రి జోగురామన్న డిబేట్ సమావేశాన్ని తిలకించారు. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ గ్రామాలలో నీటి సౌకర్యం అందించిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. కమిషన్లే లక్ష్యంగా పని చేసే కాంగ్రెస్ ప్రభుత్వం టీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనులపై బురద చల్లడమే తప్ప ప్రజాసంక్షేమం పై దృష్టి సారించడం లేదన్నారు. ప్రజలు కేసీఆర్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. ఇందులో మెట్టు ప్రహ్లాద్, చందాల రాజన్న, బట్టు సతీష్, కొండ గణేష్, అశోక్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గడ్డం రాజారెడ్డి కుటుంబానికి పరామర్శ

జైనథ్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): జైనథ్ మండల కేంద్రంలో గల జైనథ్ గ్రామ మాజీ సర్పంచ్ గడ్డం రాజారెడ్డి సతీమని త్రివేణి అనారోగ్యంతో శనివారం ఉదయం మరణించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మాజీ మంత్రి జోగురామన్న జైనథ్ గ్రామానికి చేరుకుని మృతిని కుటుంబానికి సానుభూతిని వ్యక్తం చేశారు. జైనథ్ మండల మాజీ ఎంపీపీ ఎస్.లింగారెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ డి.దేవన్న, ఎంపీటీసీ కె.సుదర్శన్, బీఆర్ఎస్ పార్టీ జైనథ్ మండల ప్రధాన కార్యదర్శి పి.గణేష్‌యాదవ్, జైనథ్ మాజీ ఎంపీపీ గోవర్ధన్‌లతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అమరుడా నిన్ను కన్న నేల తల్లి

నీ కోసం ఎదురు చూస్తుంది



అడెల్లు కోసం కుటుంబీకులు పంచి ఇచ్చిన ఇంటిస్థలం ఇదే

బోథ్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచ్చేర గ్రామానికి చెందిన మైలారపు ఆడెల్లు ఏనాడైనా లొంగిపోయి ఇంటికి చేరుకుంటాడన్న ఆశతో ఆయన అన్నదమ్ములు ఆయనకు పంపకాలలో రావాలసిన ఇంటి స్థలాన్ని ఖాళీగా ఉంచారు. మావాడు వచ్చిన తర్వాత ఇంటిని నిర్మించుకొని ఉంటాడు అన్న ఆశతో ముందుచూపుగా ఇంటి స్థలాన్ని ఆయన కోసం ఖాళీగా ఉంచారు. ఒకప్పుడు ఆయన కుటుంబీకులు నివసించిన ఈ ఇల్లును తొలగించి ఖాళీ స్థలంగా ఉంచారు. ఇల్లు కూలిపోవడంతో అన్నదమ్ములు వారి వారికి కేటాయించిన ఇండ్లలో నివాసం ఉంటున్నారు. ఆడేళ్ళుకు కేటాయించిన ఖాళీ స్థలం మాత్రం ఆయన కోసం ఎదురుచూస్తుంది. ఇదే స్థలంలో ఉన్న ఇంటిలో అడవిలో పుట్టి పెరిగాడని గ్రామస్థులు అంటున్నారు.

గాయపడ్డ విద్యార్థులకు

ముథోల్ ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్ పరామర్శ



బాధిత విద్యార్థులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్

భైంసా, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం పై కప్పు కూలిన ఘటనలో గాయపడ్డ కుభీర్ మండలం అంతర్ని గ్రామానికి ముగ్గురు విద్యార్థులను ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ పరామర్శించారు. భైంసాలోని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత విద్యార్థులను శనివారం ఎమ్మెల్యే రామరావ్ పాటిల్ పరామర్శించి ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. గాయపడ్డ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను ఏరియా ఆసుపత్రి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన రీతిలో వైద్య సేవలు అందించి బాధిత విద్యార్థులు త్వరితగతిన కోలుకునేలా చర్యలు చేపట్టాలని వైద్యాధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న భవనాల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం మూలంగానే అంతర్ని గ్రామంలో ఘటన చోటు చేసుకుందన్నారు. సమస్య ఉందని తెలిసిన విద్యాశాఖ అధికార యంత్రాంగం తగు రీతిలో స్పందించ లేదని ఆరోపించారు. ఇందుకు బాధ్యులైన వారిని గుర్తించి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని పాఠశాలలో ఉన్న సమస్యల పట్ల పలుమార్లు అసెంబ్లీలో ప్రస్తావించడం జరిగిందన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో పాఠశాలల్లో నెలకొని ఉన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు గాను అధికారులు బాధ్యతాయుతంగా చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు అలసత్వపు విధానాలను, నిర్లక్ష్యపూరి వైఖరులను విడనాడలని హితవు పలికారు. అంతర్ని గ్రామంలో చోటు చేసుకున్న ఘటనపై ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు చెప్పారు. అదే విధంగా తక్షణమే ఆయా గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను కూల్చివేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే చిన్నారుల పట్ల అప్రమత్తంగా వ్యవహారించాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందన్నారు. మండల విద్యాధికారులతో మాట్లాడి నియోజకవర్గంలో శిథిల భవనాలు ఎక్కడెక్కడ ఉన్నాయో, తెలుసుకుని నివేదికను ప్రభుత్వానికి అందించడం జరుగుతుందన్నాఉ. ఈ సంఘటన జరగడం దురదృష్టకమని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు.

కరాటే శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు కరాటే బెల్ట్‌గ్రేడ్ పరీక్ష



కరాటే బెల్ట్, సర్టిఫికెట్‌తో విద్యార్థులు



విద్యార్థినికి సర్టిఫికెట్, బెల్ట్ అందజేస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : అమ్ముల భూషణ్ కరాటే అకాడమీలో గత 30 రోజులుగా నేర్చుకున్న విద్యార్థులకు శనివారం పట్టణంలోని వాసవి ప్రైమరీ పాఠశాలలో కరాటే బెల్ట్ గ్రేడ్ ఎగ్జామ్ నిర్వహించినట్లు జపాన్ కరాటే అసోసియేషన్ అధ్యక్షులు తేజేంద్ర సింగ్ భాటియా తెలిపారు. వీరిలో ప్రతిభ కనబరిచిన 50 మంది విద్యార్థులకు బెల్ట్, సర్టిఫికెట్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుహాసిని, జపాన్ కరాటే అసోయేషన్ జిల్లా ఉపాధ్యక్షులు కొండాజి శ్రీకాంత్, అమ్ముల భూషణ్, చిరంజీవి, వంశీ, మృణాళిని, వినయ్ కుమార్, నక్షత్ర, తదితరులు పాల్గొన్నారు.

వీటి రమేష్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

● ఆయన కుటుంబానికి అండగా ఉంటాం



బోథ్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన నీటి రమేష్ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేంద్ర పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం హార్ట్‌ఎటాక్‌తో మృతి చెందిన రమేష్ అంత్యక్రియలు శనివారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్థివ దేహానికి కాంగ్రెస్ పార్టీ జెండా కప్పి పూలమాలవేసి నివాళులర్పించారు. అంతేగాక కాంగ్రెస్ పార్టీ కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. ఆయన కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ రాజు యాదవ్, ఉమేష్, మాజీ సర్పంచ్ నరసింహ దాస్, మాజీ ఎంపిటిసి కూర్మ మహేందర్, బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి, నాయకులు భోజన్న, గంగాధర్, అనిల్, సురేందర్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అడెల్లు మృతదేహం కోసం

బంధువుల ఎదురుచూపులు

● పోలీసులు అప్పగిస్తే కడసారి చూపైనా చూస్తాం



మావోయిస్టు అడెల్లు ఇంటి వద్ద శవం కోసం ఎదురుచూస్తున్న బంధువులు

బోథ్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బీజాపూర్ అడవుల్లో మృతి చెందిన తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు మైలారపు అడెల్లు మావోయిస్టు మృతదేహం కోసం ఆయన బంధువులు, గ్రామస్థులు ఎదురు చూస్తున్నారు. మూడు దశాబ్దాల కాలం పాటు అడవుల్లో ఉండి నమ్మిన సిద్ధాంతం కోసం అసువులు బాసిన ఆయన శవం తీసుకువచ్చేందుకు శుక్రవారం రాత్రి వాహనం తీసుకొని వెళ్లారు.

● ఛత్తీస్‌ఘడ్‌లో అడుగడుగునా ఆంక్షలు

మృతి చెందిన మావోయిస్టు ఆడేల్లు శవాన్ని తీసుకువెళ్లిన బంధువులకు చత్తీస్‌ఘడ్ తీవ్రఆంక్షలు మధ్య ఉన్నట్లు తెలిసింది. అయితే అక్కడి పోలీసులు మాత్రం మీరు బహిరంగంగా తిరగకండి ఈ ప్రాంతంలో ఉండే వారు ఆచార వ్యవహారాలలో వేరుగా ఉంటారు. మీరు ఎక్కడైనా ఓ ప్రాంతంలో ఉన్నట్లయితే మీకు సెవెన్ గురించి సమాచారం అందిస్తామని పేర్కొన్నట్లు తెలిసింది. వెళ్లినవారు లాడ్జిలో బస చేసినట్లు తెలిసింది. అయితే అక్కడే ఆసుపత్రిలో రెండు శవాలు ఉన్నాయని మరో నాలుగు శవా లు అడవిలో ఉన్నట్లు వారికి సమాచారం వచ్చినట్లు పేర్కొంటున్నారు. సశాలు అన్ని వచ్చిన తర్వాత పోస్టుమార్టం నిర్వహించి శవాన్ని అప్పగించనున్నట్లు సమాచారం.

● శవాన్ని ఇస్తారా లేదా ?

మావోయిస్టు నాయకుడు మైలారపు అడెల్లు మృతదేహాన్ని తీసుకు వెళ్లేందుకు వెళ్లిన వారికి శవం అప్పగిస్తారా లేదా అనేది అంతుబట్టని ప్రశ్న ఎందుకంటే శవం కోసం వెళ్ళిన వారికి శనివారం మధ్యాహ్నం వరకు ఎలాంటి సమాచారం రాలేదని తెలిసింది. అయితే ఆయన బంధువులు కుటుంబీకులు మాత్రం చివరి చూపు కోసం ఎదురుచూస్తున్నారు.

● ఊరంతా ఫ్లెక్సీ లే

అడెల్లు పుట్టి పెరిగిన గ్రామంలో ఆయన అభిమానులు, బంధువులు అడెల్లు అమర్ రహే అంటూ పేర్కొంటూ ఫ్లెక్సీలను కట్టి ఉంచారు. మరో వైపు ఆయన అభిమానులు సిద్ధాంతాల నమ్మినవారు గ్రామానికి వచ్చి వెళుతున్నారు. శవాన్ని తీసుకొని రావడానికి ఆయన చెల్లెలితో పాటు అన్న వెళ్లారన్న సమాచారం చుట్టుపక్కల గ్రామాల వారికి తెలియడంతో గ్రామానికి తరలివస్తున్నారు. ఏది ఏమైనా శవం వస్తుందా రాదా అనేది చర్చనీయాంశంగా మారింది.

అంత్యక్రియలకు హాజరు అయిన మాజీ ఎంపీపీ

బోథ్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన వీటి రమేష్ మాజీ వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండెపోటుతో మృతి చెందడంతో శనివారం జరిగిన ఆయన అంత్యక్రియలకు మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట సర్పంచ్ల సంఘం మాజీ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్‌తో పాటు రైతు నాయకులు బొడ్డు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు అల్లకొండ ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలో ఘనంగా బక్రీద్

● ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు ● శుభాకాంక్షలు తెలిపిన పలువురు నేతలు, జిల్లా ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 7: ముస్లింలు జరుపుకునే రెండో అతి పెద్ద పండుగ బక్రీద్ పర్వదినాన్ని శనివారం జిల్లా అంతటా ఘనంగా జరుపుకున్నారు. త్యాగానికి ప్రతికగా ముస్లింలు ఈ పండుగను జరుపుకోవడం అనవాయితి. ఉదయం పూట కొత్త దుస్తులు ధరించి సమీపంలోని ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పేదలకు, బంధువులకు కుర్బాని పంపిణీ చేశారు. కాగా శనివారం ఉదయం పట్టణంలోని ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం మత పెద్దలు పండుగ ప్రాముఖ్యతను తెలిపారు. అనంతరం ఒకరి నొకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాం క్షలు తెలుపుకున్నారు. ఇదిలా ఉంటే కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీని వాస్‌రెడ్డితో పాటు డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్‌రంజాని, మాజీ కౌన్సిలర్లు, సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి, పలువురు ప్రముఖులు ఈద్గా వద్ద ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అసెంబ్లి ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ హిందు ముస్లింలందరు నదుల సంగమం వలే కలిసి మెలసి ఉండాలన్నారు. పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా ముస్లింలం దరు పండుగను భక్తిశ్రద్ధలతో ఆనందంగా జరుపు కుంటారన్నారు.

భారీ బందోబస్తు

బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఈద్గా మైదానం వద్ద భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లు, మసీదుల వద్ద పికెట్స్‌ను నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా ప్రజలు మత సామరస్యాన్ని కలిగి ఉంటూ పండుగలను శాంతి యుతంగా నిర్వహించుకోవాలని సూచించారు. బందో బస్తులో డీఎస్పీలు ఎల్.జీవన్ రెడ్డి, పోతారం శ్రీనివాస్, సీహెచ్ నాగేందర్ పాల్గొన్నారు.

ఉట్నూర్: ఉట్నూర్ ఏజెన్సీలో బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. త్యాగానికి, కరుణకు, సోదర భావానికి ప్రతికగా జరుపుకునే బక్రీద్ పండుగను పురస్కరించుకుని ముస్లింలు ఈద్గాల వద్ద, మజీద్‌ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉట్నూర్ పట్టణంలోని ఈద్గావద్దా ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ ముస్లింలకు పండుగ శు భాకాం క్షలు తెలిపారు. దేశంలోని పౌరులందరు తమ తమ ఆచారాలు సంస్కృతులను కాపాడుకుంటూ దేశంలోని ప్రజలందరు సమైక్యత భావంతో ముందుకు వెళ్లాలని వారు ఆకాంక్షించారు. ముస్లింలకు పండుగ సందర్భంగా హిందువులు, క్రైస్తవు లు శుభాకాంక్షలు తెలిపారు.

నిర్మల్ జిల్లాలో..

నిర్మల్ రూరల్: నిర్మల్ జిల్లా వ్యాప్తంగా బక్రీద్ సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. శనివారం బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లా ఎస్పీ జి. జానకి షర్మిల ఐపీఎస్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో శాంతి భద్రతలను దగ్గరుండి పర్యవేక్షించారు. ముఖ్యంగా భైంసా పట్టణంలోని ఈద్గాలను, మసీదులను సందర్శించి శాంతి భద్రతల విషయంలో ఏ మాత్రం లోటు పాట్లు లేకుండా చూసుకున్నారు. చిన్నారులను, మత పెద్ద పెద్దలను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అంతటా ప్రశాంతంగా ఉండే విధంగా చూసుకున్నారు. ట్రాఫిక్, పలు అంశా ల గురించి పోలీస్ అధికారులకు క్షుణ్ణంగా ఎస్పీ వి వరించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ ఏఎస్పీ రా జేష్ మీనా ఐపీఎస్, భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ ఐపీఎస్, ఇన్స్‌పెక్టర్‌లు ప్రవీణ్ కుమార్, కృష్ణ, గోవర్ధన్, గోపీనాథ్, డీ ఎ స్పీ సమ్మయ్య, ఆర్ఐ రామ్‌నిరంజన్, ఎస్సైలు, ఆర్‌ఎస్సైలు, డాగ్ స్క్వాడ్ బృందం ఇతర పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బక్రీద్ బందోబస్తును పర్యవేక్షించిన ఎస్పీ

భైంసా: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో శనివారం జిల్లా ఎస్పీ డా.జనకీ షర్మిల పర్యటించారు. స్థానిక గడ్డెన్న వాగు ఫ్యాక్టరీ ఈద్‌గా వద్ద బక్రీద్ పర్వదినాన్ని పురష్కరించుకొని ముస్లింలు చేపట్టిన ప్రత్యేక ప్రార్థనల వద్ద బందోబస్తును పర్యావేక్షించారు. ఉదయం వేళలో ఇక్కడికి వచ్చిన ఎస్పీ జానకీ షర్మీల ఏఎస్పీ అవినాష్‌కుమార్‌తో కలిసి నేరుగా ఈద్‌గా వద్దకు వెళ్లి భద్రత చర్యలను పరిశీలించారు. ప్రత్యేక ప్రార్థనలు ముగిసిన అనంతరం ఎస్పీ జానకీ షర్మీల ముస్లీంలకు పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి బందోబస్తును పర్యావేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా భైంసా టౌన్ సీఐ గోపినాథ్ ఆధ్వర్యంలో చేపట్టిన ముందస్తు బందోబస్తు , భద్రత చర్యల పట్ల ఎస్పీ జానకీ షర్మీల సంతోషం వ్యక్తం చేశారు.

ముథోల్: భక్తి విశ్వాసాలు, త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండుగను శనివారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని తరోడా, ఎడ్‌బిడ్, ఆష్టా, మచ్కల్, తదితర గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

తానూర్: బక్రీద్ పండుగను పురష్కరించుకొని ముస్లీం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు మండల కేంద్రం తానూర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఈద్‌గాల వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో ముస్లీం సోదరులు పాల్గొని అనంతరం ఒకరికొరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

కుభీర్: మండల కేంద్రం కుబీర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం బక్రీద్ పండుగను ముస్లీం సోదరులు ఘనంగా నిర్వహించారు. బక్రీద్ పండుగను పురష్కరించుకొని ఆయా గ్రామాల్లోని ఈద్‌గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

కుంటాల: మండలంలోని ఆ యా గ్రామాల్లో ముస్లింలు బక్రీద్‌ను ఘనంగా జరు పుకున్నారు. ఈ సందర్భంగా నూతన వస్త్రా లను ధరించి ఈద్గాల వద్దకు వెళ్లి ప్ర త్యేక ప్రార్థనలు చేశారు.

సారంగాపూర్: మండల కేంద్రంతో పాటు బీరవెల్లి, స్వర్ణ, జాంతండా, వైకుంఠపూర్, చించోలి(బి), గ్రామాలతో పాటు తదితర గ్రామాల్లో శనివారం ముస్లీంలు నూతన వస్త్రాలను ధరించి బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈనేపథ్యంలో ఇద్‌గా వద్ద ముస్లింలు ప్రార్థనలు చేసి ప్రవచనాలను చదివి వినిపించారు.

భైంసా: పట్టణంలో ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని భక్తి ప్రవత్తులతో ఘనంగా నిర్వహించు కున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ముస్లిం లు స్థానిక గడ్డెన్నవాగు ప్రాజెక్టు సమీపంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కొంత మంది స్థానిక మసీదులలో ప్రార్థనలు చేపట్టారు.



ఈద్గా మైదానంలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు



శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు





కోలూర్‌లో ఈద్‌గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



చిన్నారులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల



మత పెద్దలతో నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల



ఈద్గా మైదానం వద్ద బందోబస్తును పరిశీలిస్తున్న ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



కుంటాలలో బక్రీద్ వేడుకల్లో చిన్నారులు



ముథోల్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

స్వాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పోషకాహార కిట్ల పంపిణీ



మొక్కను నాటుతున్న సంస్థ సభ్యులు



పోషకాహార కిట్లు అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, సభ్యులు

ఆదిలాబాద్‌అర్బన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): స్ట్రీట్ క్యాజ్ వీజేఐటీ, ఎంవీఎస్ఆర్ విద్యార్థుల ఆధ్వర్యంలో స్వాస్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో మొలాల గుట్ట, కోలాం గూడలో సంస్థ సభ్యులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం హైదరాబాద్‌కు చెందిన స్ట్రీట్ క్యాజ్ వీజేఐటీ, ఎంవీఎస్ఆర్ విద్యార్థుల బృందం ఆదిలాబాద్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా స్వాస్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు కారింగుల ప్రణయ్ మాట్లాడుతూ స్వచ్ఛంద సేవా కార్యక్రమంలో భాగంగా మొలాల గుట్ట, కోలాంగూడ గ్రామా ల్లో పర్యటించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు పురుగుల మందు పిచికారి యంత్రం, గర్భిణులు, చిన్నారులకు పోషకాహార కిట్లు, 12 సౌర దీపాలు అందించడం జరిగిందని తెలిపారు. మొలాల గుట్టలో గిరిజనుల హస్తకళలకు శాశ్వత షెడ్ నిర్మించడం జరిగిందన్నారు. ఇందులో స్ట్రీట్ క్యాజ్ వీజేఐటీ డివిజనల్ ప్రెసిడెంట్ నేహాల్, ఎంవీఎస్ఆర్ డివిజనల్ ప్రెసిడెంట్ హేతల్, లక్ష్మణ్‌సింగ్, కొండ గోవర్ధన్, సాయికిరణ్, అక్షయ్, వెంకటేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన కోనేరు ప్రతిష్ఠాపన



యజ్ఞంలో పాల్గొన్న కోనేరు నిర్మాణ దాత అల్లాల శ్రీనివాస్ దంపతులు

కుంటాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కుంటాల భక్తుల ఇలవెల్పు గజ్జలమ్మ మహా పుష్కరిని కోనేరు ప్రతిష్ఠాపన కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. వేద పండితులు గురుమంచి చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ కార్యక్రమం ఆదివారం వరకు కొనసాగనుంది. శనివారం ఉదయం మహా గణపతి పూజ, పుణ్యాహవచనం, నాంది, రక్షాబంధన, పంచగవ్యప్రాశన, ఆచార్యాది రుత్విక్ వరణ, వాస్తు ఆరాధన, యాగశాల ప్రవేశ, ద్వార పూజ, శాల పూజ, అఖండ దీప స్థాపన, అం కురార్పణ, ధ్వజారోహణ, వాస్తు క్షేత్ర పాలక యోగిని నవగ్రహా సర్వతో భద్ర మండపారాధన, అగ్ని ప్రతిష్ట, గణపతి హోమం, వాస్తు క్షేత్ర పాలక యోగిని నవగ్రహా భద్ర మండప వాహనములు, పంచ గవ్య పంచామృత నదిజల సంప్రోక్షణ, చండీ హోమం, కళశ స్థాపన పూజ, ఆదివారం గణపతి పూజ, కర్మణ పుణ్యా హవచనము గర్తన్యాసము, రత్న న్యాసం, రాతున్యాసం, బీజ న్యాసం, యంత్రప్రతిష్ట, శిఖ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ బలిహరణము, శాంతి పౌష్టిక హోమాలు, జయాదివచనము, బలిహరణ గజ్జలమ్మవారికి స్వాగతం మహాపూర్ణాహుతి కుంభాభిషేకం, పుష్కరిణి స్నానం ఆశీర్వచనం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కోనేరు నిర్మాణ దాత అల్లాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

'జొన్న పంట అమ్ముకున్న రైతుల అకౌంట్లో డబ్బులు జమ చేయాలి'

బోథ్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): గత నెల రోజుల క్రితం ప్రభుత్వ రంగ సంస్థలైన మార్కెట్ వారు కొనుగోలు చేసిన జొన్న పంటకు సంబంధించిన డబ్బులను తక్షణమే రైతులకు జమ చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగేపు బోరన్న డిమాండ్ చేశారు. శనివారం ఆయన బోథ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతులు ప్రస్తుతం ఖరీఫ్ పంట సాగు కోసం సిద్ధమవుతున్నారని, అయితే వారికి పంట పెట్టుబడుల కోసం డబ్బులు లేక ఇబ్బందులు గురవుతున్నారన్నారు ఈ కార్యక్రమంలో రైతులు భరత్, రామ్ చందర్, విలాస్ రాజు, శంభు తదితరులు ఉన్నారు.

అశోక వనంలో.. ఆశ్రయం పొందుతున్న వయో వృద్ధులు

● 20 సంవత్సరాలుగా ఎందరికో ఆశ్రయం కల్పించిన సాయిలింగి వృద్ధాశ్రమం



తలమడుగు మండలంలోని సాయిలింగి వృద్ధాశ్రమం



సాయిలింగి వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వయోవృద్ధులు

తలమడుగు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మానవసేవయే మాధవ సేవ అనే స్పూర్తితో ఢిల్లీకి రాజైన తల్లికి కొడుకు లాగే కాని పెంచిన తల్లి దండ్రులకు పుట్టిన ఊరుకు సేవ చేయాలనే దృఢ సంకల్పంతో ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం సాయిలింగి గ్రామానికి చెందిన దెబ్బడి అశోక్, బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ అధికారి 25 ఏళ్ల క్రితం గ్రామస్తులతో కలిసి గ్రామ సభ ఏర్పాటు చేసి గుడి బడి తడి ఒడి అనే నినాదంతో ముందుకు వచ్చి మొదటగా సాయిబాబా ఆలయాన్ని ఏర్పాటు చేసి లింగి గ్రామాన్ని సాయి లింగి గ్రామంగా అన్నా మా కారణం చేసి అభివృద్ధి పరిచారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను హైస్కూల్‌గా ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉన్నత విద్యను అందించేందుకు ఎంతో కృషి చేశారు. అంతేకాకుండా ప్రతీ రైతుకు సాగునీరు అందిం చేందుకు గ్రా మం లో గల చెరువును పూడిక తీయించి, వాగులపై చెక్ డ్యాములు నిర్మించి భూగర్భ జలాలు పెంపొందించేందుకు ఎంతో కృషి చేశారు. ప్రస్తుతం రైతులు రెండు పంటలను సాగు చేసుకుంటూ కూరగాయలు సాగు చేస్తూ జిల్లా కేంద్రంలోని రైతు బజార్‌కు కూరగాయలను తరలించి విక్రయించుకుంటున్నారు. అనంతరం కొంతమంది దాతల సహకారంతో సాయి వృద్ధాశ్రమం ఏర్పాటు చేసి ఎందరో మంది అభాగ్యు లకు. వయోవృద్ధులకు ఆశ్రమం కల్పించారు. దాదాపు వృద్ధాశ్రమంలో 75: మంది వృద్ధులు ఆసరా పొందుతున్నారు. వారికి మౌలిక వసతులతో పాటు వైద్య సదు పాయం ఆధ్యాత్మిక కార్యక్రమాలు, కాలక్షేపం కోసం భజనలు, సంకీర్తనలు ఏర్పాటు చేశారు. వృద్ధాశ్రమంలో కొంతమంది సామాజిక సేవ స్పూర్తితో శుభకార్యాలు, కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమాలు, దుస్తుల పంపిణీ నిర్వహిస్తున్నారు. అంతేకాకుం డా వివిధ ఉద్యోగాల సంఘాల సభ్యులు. నెల నెల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారు. వృద్ధుల కోసం ఎంతో కృషి చేస్తున్న దెబ్బడి అశోక్‌ను గ్రామస్తులతో పాటు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందిస్తున్నారు. ఇదే స్పూర్తితో ప్రతి ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



వృద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు అశోక్



సాయిలింగి వృద్ధాశ్రమంలోని వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన అదనపు గదులు



కలిసి భోజనం చేస్తున్న వృద్ధులు



వృద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు అశోక్ ఆప్యాయతతో పలకరిస్తున్న వృద్ధురాలు

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.8। కనిష్ఠం 25.7



ఆదిలాబాద్
జిల్లా వార్తలు

ఆదివారం 8 జూన్ 2025





మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్


సైబర్ నేరానికి గురైతే 1930 ద్వారా సంప్రదించాలి : ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరానికి గురైన వెంటనే 1930 నెంబర్ ద్వారా సంప్రదించి ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. ముఖ్యంగా సైబర్ నేరాల బారీన పడిన గంటలోపు ఫిర్యాదు చేసినట్లయితే ఆర్థిక నష్టం జరిగిన వాటిని తిరిగి రప్పించే అవకాశం ఎక్కువగా ఉన్నందున గోల్డెన్ హావర్‌లో ఫిర్యాదు చేయడం చాలా ముఖ్యమైనదని తెలిపారు. సమాజంలో ప్రజలకు జిల్లా పోలీసు యంత్రాంగం తరఫున మరింత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుత సమాజంలో జరిగే ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, లోన్‌ఫ్రాడ్, ఏపీకే ఫైల్స్, సోషల్ మీడియా ఫ్రాడ్, జాబ్‌ఫ్రాడ్, డిజిటల్ అరెస్టు, లాటరీ ఫ్రాడ్, క్రెడిట్‌కార్డు ఫ్రాడ్‌లు ఎక్కువగా జరుగుతున్నదన్నారు.ప్రజలకు వాటిపై పూర్తి అవగాహన కల్పించి ఇలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండడం ఉత్తమ మార్గమని తెలియజేశారు.వాట్సాప్ గ్రూపులలో ఎలాంటి ఏపీకే ఫైల్స్‌లను డౌన్‌లోడ్ చేసుకోకుండా ఉండాలని, వాటి ద్వారా మొబైల్‌ఫోన్ సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్తుందన్నారు. ఇలాంటి వాటికి గురైనప్పుడు వెంటనే జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించాలని సూచించారు.

నేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వజ్రోత్సవ పండుగ

ఉట్నూర్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1950వ సంవత్సరంలో ఏర్పాటు కుఆవడంతో అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఆధ్వర్యంలో ఆదివారం వజ్రోత్సవ పండుగ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్, ఎంపీ గోడం నగేష్‌తో పాటు కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా, సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ఏఎస్పీ కాజల్‌సింగ్‌తో పాటు ఇక్కడ విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు హాజరు అవుతున్నందున.. పూర్వ విద్యార్థులందరూ హాజరు కావాలని నిర్వహణ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

● నేల బీటలు వారడంతో వాడుముఖం పడుతున్న పత్తి మొలకలు



- జిల్లాలో 2.8 మి.మీ.ల లోటు వర్షపాతం నమోదు
- వారం రోజులుగా పత్తా లేకుండా పోయిన వర్షాలు
- ముందస్తు వర్షాలకే మురిసిన రైతులు
- ఇప్పటి వరకు 25 శాతం పంటల సాగు పూర్తి
- వరుణుడి కరుణ కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలు

తొలకరి.. జాడేది?

ఆదిలాబాద్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ముందస్తు వర్షాలు మురిపించినా.. తొలకరి వర్షాల జాడే లేకపోవడంతో అన్నదాతలు ఆశగా వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తున్నారు. మునుపెన్నడూ లేనివిధంగా ఈ యేడు మే చివరి మాసంలో ఓ మోస్తారు స్థాయి నుంచి భారీ వర్షాలు కురవడంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. దీంతో అన్నదాతలు ఉత్సాహంగా పంటల సాగు పనులకు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా వానాకాలం సీజన్‌లో పత్తి, సోయా, కంది, జొన్న, మొక్కజొన్న పంటలను వర్షాధారంగానే సాగు చేస్తారు. ఈ యేడు జిల్లాలో 5 లక్షల 85వేల ఎకరాలలో వివిధ రకాల పంటలు సాగయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మే 25 నుంచి 29 వరకు భారీ వర్షాలు కురిసిన ఆ తర్వాత ముఖం చాటేయడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్థుతం జిల్లాలో 40 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో అక్కడక్కడా మొలకెత్తిన పత్తి మొలకలు వాడుముఖం పడుతున్నాయి. జిల్లాలో జూన్ 1 నుంచి 7 వరకు సాధారణ వర్షపాతం 18.2 మి.మీ.లు కాగా, ఇప్పటి వరకు 2.8 మి.మీ.ల లోటు వర్షపాతం నమోదైనట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. దాదాపుగా అన్ని మండలాల్లో అధిక లోటు వర్షపాతం కనిపిస్తుంది. మరో రెండు, మూడు రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటే వేసిన విత్తనాలు నేలపాలయ్యే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆవేదనకు గురవుతున్నారు. అయితే వాతావరణ శాఖ అధికారుల లెక్కల ప్రకారం ఈ నెల 12 నుంచి జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

కరుణించని తొలకరి

ఈ యేడు తొలకరి వర్షాల జాడే కనిపించడం లేదు. వానాకాలం సీజన్ ప్రారంభమై వారం రోజులు గడుస్తున్నా.. ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కావడం లేదు. జూన్ 1 నుంచి 7 వరకు జిల్లాలో కనిష్ఠంగా 2.8 మి.మీ.ల వర్షం కురిసింది. దీంతో మైనస్ 85.0 మి.మీ.ల లోటు వర్షపాతం కనిపిస్తుంది. జూన్ ప్రారంభం నుంచి వర్షాలు కురిసి ఉంటే ఇప్పటి వరకు 50 శాతం పంటల సాగు పూర్తయ్యేదని రైతులు చెబుతున్నారు. మే చివరి మాసంలో కురిసిన వర్షాలకు సాగునీటి వసతి ఉన్న కొంత మంది రైతులు పత్తి విత్తనాలను వేశారు. నేలలో సరైన తేమ ఉండడంతో ఇప్పటికే విత్తనాలు కూడా మొలకెత్తాయి. కానీ గత వారం రోజులుగా వర్షపు జాడ కనిపించక పోవడంతో మొలకలు వాడుముఖం పడుతున్నాయని రైతులు చెబుతున్నారు. కొంత మంది రైతులు స్పింక్లర్ల ద్వారా మొలకలకు నీటిని అందించే ప్రయత్నం చేస్తున్నారు. నీటివసతి లేని రైతులు మాత్రం వరుణుడి కరుణపైననే భారం వేస్తూ వదిలేస్తున్నారు. ఎకరాన రూ.10 వేల వరకు ఖర్చు చేసి విత్తనాలను విత్తినట్లు చెబుతున్నారు. అయితే అధికారులు మాత్రం తొలకరి వర్షాలకే తొందరపడవద్దంటూ సూచిస్తున్నారు. పత్తి, సోయా పంటల సాగుకు మరింత సమయం ఉందని పేర్కొంటున్నారు.


ఆశ పెట్టిన రోహిణి

అసలు రోహిణి కార్తెలో రోళ్లు పగిలే ఎండలు కొడతాయన్న నానుడి. కానీ ఈ యేడు రోహిణి కార్తెలోనే భారీ వర్షాలు కురవడంతో వాతావరణం పూర్తిగా చల్లబడి పోయింది. దీంతో ఆదర బాదరగా అన్నదాతలు పంటల సాగును ప్రారంభించారు. జూన్ మాసం ప్రారంభమైన ఇప్పటి వరకు వర్షాలు కురవక పోవడంతో అన్నదాతల అంచనాలు తారుమారవుతున్నాయి. ముందస్తు వర్షాలు మురిపించిన తొలకరి వర్షాలు కరుణించడం లేదంటున్నారు. రోహిణి కార్తె ముగిసి మృగశిర కార్తె మొదలైన వరుణుడు కరుణించక పోవడం గందరగోళ పరిస్థితులకు దారి తీస్తుంది. దీంతో పంటల సాగు పనులు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందంటున్నారు. నేలలో 60 నుంచి 70 తేమ శాతం ఉంటేనే విత్తనాలను విత్తుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నల్లరేగడి నేలల్లో కొంత తేమ ఉన్న చలక నేలలు మాత్రం బీటలు వారి కనిపిస్తున్నాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో విత్తనాలను విత్తుతే మొలకెత్తే పరిస్థితి ఉండదని రైతులు అభిప్రాయపడుతున్నారు.

తప్పని ఎదురుచూపులు

జిల్లాలో ఎక్కువగా వర్షాధార పంటలనే సాగు చేయడంతో వరుణుడి కరుణ కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో రైతులు వర్షాల కోసం గ్రామ దేవతలకు పూజలు చేస్తున్నారు. నైరుతి రుతుపవనాల కోసం ఎదురు చూడాల్సిన

(తరువాయి 6వ పేజీలో...)





● గత మూడు సంవత్సరాలుగా నత్తనడకన కొనసాగుతున్న లక్ష్మీపూర్ గ్రామ పంచాయతీ భవన నిర్మాణం

గడ్డి గుడిసెలో గ్రామ పంచాయతీ!

● నత్తనడకన నూతన భవన నిర్మాణ పనులు ● ఇటు అధికారులకు.. అటు ప్రజలకు తప్పని ఇబ్బందులు

తలమడుగు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పాలనా సౌలభ్యం కోసం గత బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ సహాయంలో కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసినప్పటికీ.. సొంత భవనాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. కొన్ని గ్రామాల్లో అద్దె భవనాలు, ప్రభుత్వ భవనాలలో పంచాయతీ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా మండలంలోనూ లక్ష్మీపురం గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసినప్పటికీ సొంత భవనం లేకపోవడంతో గడ్డి గుడిసెలోనే అధికారులు విధులు నిర్వహించడం గమనార్హం. తాత్కాలికంగా ఏర్పాటు చేసినప్పటికీ గత ఐదేళ్లుగా గడ్డి గుడిసెలోనే పంచాయతీ పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం వర్షానికి విలువైన గ్రామపంచాయతీ పత్రాలు సైతం తడిసి పోతున్నాయని పంచాయతీ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా గ్రామపంచాయతీలో. గ్రామంలో ఏం కార్యక్రమాలు జరిగినా తాత్కాలిక గడ్డి గుడిసెలోనే సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆదివాసీ, గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా ప్రభుత్వం ఐటీడీఏ నిధుల ద్వారా దాదాపు రూ.20 లక్షల వ్యయంతో నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. అయినా మూడు సంవత్సరాల నుంచి గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు నత్త నడకన కొనసాగుతున్నాయి. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో సదర్ కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు సైతం పాటించలేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మట్టితో కూడిన నల్లటి తీసుకొని నిర్మాణంలో ఉపయోగించారని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరగా గ్రామ పంచాయతీ నిర్మాణ పనులు పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



● గడ్డి గుడిసెలో కొనసాగుతున్న లక్ష్మీపూర్ గ్రామ పంచాయతీ



కంప్యూటర్ తరగతి గదిని ప్రారంభిస్తున్న నోడల్ అధికారి భరత్‌చౌహాన్

గ్రామీణ ప్రాంతాల్లో కంప్యూటర్ విద్య

ఉట్నూర్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోనే ప్రభుత్వ పాఠశాలలో చదువు కుంటున్న విద్యార్థుల కోసం ప్రభుత్వం కంప్యూటర్ విద్యను అందుబాటులోకి తెస్తోంది. దీనిలో భాగంగా మండలంలోని తాండ్ర బాబాపూర్ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ విద్యను శనివారం మండల నోడల్ అధికారి భరత్‌చౌహాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్నటువంటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంప్యూటర్ విద్య, జిల్లాలోని వివిధ పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ విద్యను ఈ విద్యా సంవత్సరానికి గాను విద్యార్థులకు మరింత చేరువగా అందించడానికి ఉపాధ్యాయులు తమ సొంత ఖర్చుతో కంప్యూటర్‌ను అమర్చుకొని కంప్యూటర్ విద్యను అందించడానికి కృషి చేయడం హర్షనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి స్వామి, ప్రధానోపాధ్యాయులు దినేష్, ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, ప్రహ్లాద్, చంద్రమోహాన్, గ్రామస్థులు కేంద్రే రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అడెల్లు మృతదేహం కోసం చర్చలు

బోథ్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): బీజాపూర్ అడవుల్లో మృతి చెందిన మావోయిస్టు నాయకుడు మైలారపు అడెల్లు మృతదేహాన్ని తీసుకు వచ్చేందుకు ఆయన కుటుంబీకులు శుక్రవారం రాత్రి బయలుదేరి వెళ్లారు. అయితే దాదాపు 400 కిలోమీటర్ల దూరం ప్రయాణించిన వారు మృతదేహాన్ని ఇక్కడికి తీసుకు వచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. అయితే, వెళ్లినవారు స్థానిక పౌర హక్కుల సంఘం నాయకులతో చర్చలు జరిపి పోలీసులతో మాట్లాడినట్లు సమాచారం. అయితే అడవుల్లో నుంచి మావోయిస్టుల మృతదేహాలను హెలికాప్టర్‌లో తీసుకు వచ్చినట్లు అక్కడికి వెళ్లిన వారు తెలిపారు. మృతదేహాలు అన్నింటికీ పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం అప్పగిస్తారా? లేదా? అనేది తెలియడం లేదని వారు పేర్కొన్నారు.

రైతుల కోసం పొలంబాట : ఎమ్మెల్యే

జైనథ్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): వర్షాకాల సమయంలో రైతులు తమ చేనులకు వెళ్లడానికి సరైన రహదారులు లేక తీవ్రఇబ్బందులు పడుతున్నారని ఇటీవల అసెంబ్లీలో ప్రస్తావించడంతో.. ప్రభుత్వం స్పందించి పొలం బాట కార్యక్రమాన్ని చేపట్టిందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శనివారం జైనథ్ గ్రామం నుంచి స్థానిక చేనులకు వెళ్లేందుకు రూ.28 లక్షల నిధులతో సుమారు 5కి.మీ.ల రహదారి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. విడతల వారీగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల రైతులు వర్షాకాలం సైతం చేనులకు వెళ్లే విధంగా రోడ్డు సౌకర్యం కల్పించడానికి కృషి చేస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ఇప్పటికే ఒక ప్రణాళిక రూపొందించామని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



రహదారి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్



సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

వాంకిడికి పూర్వ వైభవం తెస్తాం

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): వాంకిడి గ్రామానికి పూర్వ వైభవం తీసుకొస్తామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని వాంకిడి గ్రామంలో 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి విద్యుత్ శాఖా ఎస్‌సీ చౌహాన్ జైవంత్ రావ్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ఉద్దేశించి మాట్లాడుతూ నాడు పూర్వీకుల కాలంలో వాంకిడి ఏవిధంగా మెరుస్తుండెనో మళ్లీ అదే విధంగా కళకళలాడేవిందగా వాంకిడి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని అన్నారు. అదే విధంగా ఈ చుట్టుపక్కల ప్రజలకు రైతులకు మంచి ప్రయోజకరంగా ఉండి రైతులకు సకాలంలో 24గంటల విద్యుత్ అందుబాటులో ఉంటుందన్నారు. ఇందులో మాజీ ప్రజాప్రతినిదులు రాథోడ్ సజన్. జాదవ్ గణేష్. దేవేందర్ రెడ్డి. శివారెడ్డి. రవీందర్ రెడ్డి. నానక్ సింగ్. సురేందర్, రమేష్, సవాయిరాం, గులాబ్‌సింగ్. తదితరులు పాల్గొన్నారు.

'జాబితా నుంచి పేరు తొలగించారు'

ఉట్నూర్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని హస్నాపూర్ గ్రామంలో నివాసం ఉంటున్న తన భార్య పేరు మీద ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా.. మండల స్థాయి అధికారులు తన పేరు తొలగించి అన్యాయం చేశారని, సబ్ కలెక్టర్ జోక్యం చేసుకుని న్యాయం చేయాలని హస్నాపూర్‌కు చెందిన జాదవ్ బొజ్జు దరఖాస్తు సమర్పించినట్లు తెలిపారు. 5 ఏళ్ల క్రితం అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం కాగా మండల స్థాయి అధికారులు నూతన ఇల్లు నిర్మాణానికి హామీ ఇచ్చారన్నారు. ప్రస్తుతం ఇందిరమ్మ జాబితాలో పేరు వస్తే తొలగించారని తెలిపారు. సబ్ కలెక్టర్ న్యాయం చేయాలని ఆయన కోరారు.

స్పందించారు.. చేయూతనందించారు

● జిల్లా కలెక్టర్ రాజర్షి షా చొరవతో రెసిడెన్సియల్ పాఠశాలకు చిన్నారుల తరలింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్





ఇచ్చోడలో పోషకులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు

ఇచ్చోడ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మొదటి నుంచి విద్యాశాఖపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్న ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా పలు సంక్షేమ పథకాలను విద్యార్థులకు అందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలను గణనీయంగా పెంచే దిశగా ఇప్పటికే పలు ఆదేశాలను విద్యాశాఖకు అందించారు. 'బడికి దూరమై బతుకు బారమై' అనే శీర్షికన శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా పాలనాధికారి వెంటనే స్పందించారు. ఆ చిన్నారలు పాఠశాలల్లో చేరేలా పురమాయించారు. దీనావస్థలో ఉన్న కుటుంబానికి అండగా నిలుస్తూ చిన్నారుల్లోని ఒకరిని ఆదిలాబాద్‌లోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో అడ్మిషన్ కోసం, మిగిలిన ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులు, ప్రీప్రైమరీ చిన్నారులందరీని ఇచ్చోడలోని పాఠశాలల్లో ప్రవేశాలు పొందేలా తగు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంరక్షణ అధికారి స్వామి పేర్కొన్నారు. అంతేకాకుండా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులు ఇచ్చోడలోని చిన్నారుల కుటుంబాలను కలిసి బాలల రక్షణపై వారికి కౌన్సెలింగ్ నిర్వహించి వారికి పాఠశాలల్లో అడ్మిషన్లు కల్పించేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇచ్చోడలో మొత్తం 8మంది విద్యార్థులను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇకపై ప్రభుత్వ హాస్టల్‌లోనే ఉంటూ ఉచిత భోజనంతో పాటు విద్యను పొందనున్నారు ఆ చిన్నారులు. ఈ కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి వినోద్, సోషల్ వర్కర్ రవికాంత్, అశ్విని, సిబ్బంది ప్రేమేందర్, తదితరులు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధల మధ్య బక్రీద్ పండుగ

● జిల్లాలో ఈద్గాల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
● శుభాకాంక్షలు తెలిపిన పలువురు నేతలు, జిల్లా ఎస్పీ

6, 7వ పేజీలలో..